

సాక్షి
అనంతపురం
మంగళవారం । 29 । ఆగస్టు । 2023



టన్ను చీనీ రూ.17,500
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.17,500 పలికాయి.



కిలో టమాట రూ.21
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.21, కనిష్టంగా రూ.10, సరాసరిన రూ.15 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం 38.4°/22.9°
జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు పెరిగాయి. గాలివేగం తగ్గడంతో ఉక్కపోత పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

ఇంజినీరింగ్ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం విశ్వ విద్యాలయ ఇంజినీరింగ్ కళాశాలలో జూలై, ఆగస్టు నెలల్లో నిర్వహించిన బీటెక్ రెండో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్20) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. 404 మంది విద్యార్థులకు గాను 339 మంది ఉత్తీర్ణులయ్యారు. 83.91% శాతం ఉత్తీర్ణత నమోదైందని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వి.సత్యనారాయణ తెలిపారు. ఫలితాల కోసం కళాశాల అకడమిక్ సెక్షన్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, హెచ్ఓడీలు చంద్రమోహన్‌రెడ్డి, బాలనరసయ్య, కె.ఎఫ్.భారతి, ఎం.రామశేఖరరెడ్డి, కళ్యాణి రాధ, అజిత, లలితకుమారి పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ ఐదో సెమిస్టర్ ఫలితాలను వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి సోమవారం విడుదల చేశారు. మొత్తం 7,203 మంది పరీక్షలు రాయగా, 4,739 మంది ఉత్తీర్ణులయ్యారు. బీఏలో 1,101 మందికి గాను 790 మంది, బీకాంలో 5,174 మందికి గాను 3,259 మంది, బీబీఏలో 928 మందికి గాను 690 మంది పాసయ్యారు. రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవడానికి సెప్టెంబర్ 12 తుది గడువుగా నిర్దేశించారు. ప్రతి పేపర్‌కూ రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య, సీఈ కె.శ్రీరాములు నాయక్, అడిషనల్ కంట్రోలర్స్ వి.శైలజ, అనూరాధ, పీఆర్వో రామ్‌గోపాల్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ చెంగ్రాయుడు పాల్గొన్నారు.


కేఎంపీఎల్ సాధనలో గుత్తి డిపోకు అవార్డు



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న మెకానికల్ చార్జ్‌మెన్ సాంబ శివప్ప

అనంతపురం సెంట్రల్: రాయలసీమ జోన్ పరిధిలో అత్యధికంగా కేఎంపీఎల్ సాధించిన గుత్తి డిపోకు అవార్డు లభించింది. 2022–23లో అత్యధికంగా 5.52 కేఎంపీఎల్ సాధించినట్లు గుత్తి డిపో అధికారి శ్రీపాద తెలిపారు. ఆర్టీసీ ఎండీ నుంచి వచ్చిన ప్రశంసపత్రాన్ని సోమవారం గుత్తి హెచ్‌పీసీఎల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో డిప్యూటీ చీఫ్ మెకానికల్ మోహన్‌కుమార్ చేతుల మీదుగా మెకానికల్ చార్జ్‌మెన్ సాంబశివప్పకు అందజేశామన్నారు. ఈ సందర్భంగా శివప్పను ఘనంగా సన్మానించారు.

నేటి నుంచి పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ



అనంతపురం రూరల్: కొత్త లే అవుట్ల ఏర్పాటులో నిబంధనలతో పాటు పంచాయతీల్లో చేపట్టే పరిపాలన తదితర అంశాలపై ఈ నెల 29 నుంచి సెప్టెంబర్ 30 వరకు పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు ఉంటాయని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి పంగల్ రోడ్డులో ఉన్న టీటీడీసీలో శిక్షణ ఉంటుందన్నారు. గ్రేడ్-1 స్థాయి నుంచి గ్రేడ్-5 స్థాయి పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఉంటుందన్నారు. జిల్లాలో 525 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఒక్కో బ్యాచ్‌లో 50 మందికి శిక్షణ ఉంటుందన్నారు. నేటి నుంచి సెప్టెంబర్ 30 వరకు 5 విడతల్లో గ్రామ పంచాయతీల పరిధిలో కొత్త లే అవుట్ల ఏర్పాటు అములులో ఉన్న నిబంధనలు, జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష కార్యక్రమంలో గ్రామకంఠాల పరిధిలో ఉన్న ఇళ్ల యాజమానులకు హక్కుపత్రాల జారీకి సంబంధించిన అంశాలు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన, ఉపాధి హామీ కార్యక్రమాలు, ఉద్యోగుల విధి నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

చిన్నారి తల్లులు

- 'అనంత' జిల్లాలో 4 మాసాల్లో 458 'మైనర్' ప్రెగ్నెన్సీలు
- ఇందులో పదహారేళ్లలోపు అమ్మాయిలు 107 మంది
- శ్రీసత్యసాయి జిల్లాలో మరింత ఎక్కువగా టీనేజీ ప్రెగ్నెన్సీలు
- చిన్న వయసులోనే గర్భం దాలుస్తున్న యువతులు 3.23 శాతం
- అమ్మాయిలను వెంటాడుతున్న సామాజిక మాధ్యమాల దుష్ప్రభావం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో బాల్య వివాహాలు జరుగుతుండగా ఆపినవి

సంవత్సరం	ఆపేసిన పెళ్లిళ్లు
2019	209
2020	201
2021	460
2022	418
2023	164



బాల్యవివాహాలతో భారీ నష్టం
- చదువు ఆగిపోయి కెరీర్ అర్థంతరంగా ముగుస్తుంది
- చిన్న వయసులో పెళ్లి చేసుకోవడం వల్ల బరువు తక్కువ పిల్లలు పుట్టే అవకాశం
- చిన్న వయసులో తల్లి కావడం వల్ల రక్తహీనత సమస్య తలెత్తుతుంది
- ప్రీ మెచ్యూర్ అంటే 9 నెలలకు ముందే పిల్లలు పుట్టే అవకాశం
- దీనివల్ల కాన్పు సమయంలో తల్లికీ బిడ్డకూ ఇద్దరికీ ప్రాణాపాయం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఓ వైపు బాగా చదువుకున్న అమ్మాయిలు 30 ఏళ్లు దాటినా పెళ్లి చేసుకోవడం లేదు. దీనికారణంగా 40 దాటే వరకూ పిల్లలు కలగక ఫెర్టిలిటీ సెంటర్ల చుట్టూ తిరుగుతున్నారు. మరోవైపు పదహారేళ్లు నిండకముందే కొందరు అమ్మాయిలు తల్లులవుతున్నారు. పరస్పర ఈ వైరుధ్యం పలువురు వైద్యులు, నిపుణులను విస్మయపరుస్తున్న అంశం. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రసవాలకు వస్తున్న గర్భిణుల్లో 3 శాతానికి పైగా మైనర్ అమ్మాయిలు వస్తున్నట్టు తేలింది. బాల్యవివాహాల్లో అనంతపురం జిల్లా రాష్ట్రంలోనే మొదటిస్థానంలో ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో గడిచిన నాలుగు నెలల్లో అనంతపురం జిల్లా వ్యాప్తంగా 458 మంది మైనర్ అమ్మాయిలు గర్భం దాల్చారు. ఇందులో 16 ఏళ్లలోపు అమ్మాయిలు 107 మంది ఉండటం ఆందోళన కలిగిస్తోంది. శ్రీసత్యసాయి జిల్లాలోనూ టీనేజీ ప్రెగ్నెన్సీలు నమోదయ్యాయి. మొత్తం ప్రసవాల్లో 3.23 శాతం మైనర్లవే కావడం గమనార్హం. సామాజిక మాధ్యమాల ప్రభావంతో మైనార్టీ తీరని అమ్మాయిలు ప్రేమ– పెళ్లి బాట పడుతున్నారు.

ప్రతిబంధకంగా బాల్య వివాహాలు
గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని సామాజిక వర్గాల్లో అమ్మాయి అంటేనే భారంగా భావిస్తున్నారు. అందుకే 15 ఏళ్లకే పెళ్లి చేస్తున్నారు. రాయదుర్గం, మడకశిర, కదిరి, ధర్మవరం, కళ్యాణదుర్గం వంటి ప్రాంతాల్లో ఎక్కువగా బాల్య వివాహాలు జరుగుతున్నాయి. పదో తరగతి చదువుతూండగానే పెళ్లి చేస్తున్నారు. బాగా చదువుకుని కెరీర్‌లో స్థిరపడాల్సిన సమయంలో వారికి పెళ్లి తీవ్ర ప్రతిబంధకంగా మారుతోంది.

నిఘా పెట్టినా ఆగడం లేదు
స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాల్యవివాహాలను అడ్డుకుంటున్నా మరోవైపు ఏదో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి. బాల్యవివాహాలు కుదిర్చిన పెద్దలు, ఇరువురు తల్లిదండ్రులకు కఠిన శిక్షలు పడే అవకాశమున్నా కొన్ని ప్రాంతాల్లో అడ్డూ అదుపూ లేకుండా పోయింది. చైల్డ్‌లైన్ 1098, హెల్ప్‌లైన్ 181, డయల్ 100కు ఫోన్ చేస్తే పెళ్లిళ్లు ఆపేస్తారు. దీన్ని వినియోగించుకోవాలని ఐసీడీఎస్ అధికారులు కోరుతున్నారు.

ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి జూలై వరకూ గర్భిణుల వివరాలు...

అనంతపురం జిల్లాలో...	
నమోదైన గర్భిణుల సంఖ్య	16,234
16 ఏళ్ల లోపు వారు	107
18 ఏళ్ల లోపు వారు	351
మైనర్ అమ్మాయిల్లో తల్లుల శాతం	2.86

శ్రీసత్యసాయి జిల్లాలో...	
నమోదైన గర్భిణుల సంఖ్య	11,473
16 ఏళ్ల లోపు వారు	80
18 ఏళ్ల లోపు వారు	369
మైనర్ అమ్మాయిల్లో తల్లుల శాతం	3.23

కౌన్సెలింగ్ ఇస్తున్నాం



కొన్ని ప్రాంతాల్లో 15 ఏళ్లు దాటగానే అమ్మాయిలను తల్లిదండ్రులు భారంగా భావిస్తున్నారు. ముందస్తుగా పెళ్లి చేసి బాధ్యతల నుంచి తప్పుకుంటున్నారు. మరికొన్ని చోట్ల సామాజిక మాధ్యమాలకు ప్రభావితమై యువతీ యువకులు పెళ్లి చేసుకుంటున్నారు. ఇటీవలి కాలంలో ఫేస్‌బుక్, ఇన్‌స్టా గ్రామ్‌ల ప్రభావం ఎక్కువైంది. పలు ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు కౌన్సెలింగ్ ఇస్తున్నాం.
–శ్రీదేవి, ప్రాజెక్ట్ డైరెక్టర్, ఐసీడీఎస్

పంటనష్టాన్ని ప్రభుత్వానికి నివేదిస్తాం



పి.నారాయణపురం వద్ద ఆముదం పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కూడేరు: ఖరీఫ్ సీజన్‌లో వర్షా భావంతో దెబ్బతిన్న పంటల వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు పద్మలత, సహదేవరెడ్డి, అశోక్‌కుమార్, జిల్లా వనరుల కేంద్రం డీడీ మద్దిలేటి తెలిపారు. సోమవారం వారు ఏడీ రవితో కలిసి కూడేరు మండలం కమ్మూరులో ఆముదం, కడదరకుంటలో కంది, వేరుశనగ, పి.నారాయణపురంలో ఆముదం పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఖరీఫ్‌కు సంబంధించి అదనులో ఆశించినస్థాయి వర్షాలు కురవలేదన్నారు. తక్కువ వర్షానికే వేరుశనగ, ఆముదం, కంది ఇతర పంటలు సాగు చేశారన్నారు. విత్తిన తర్వాత కూడా తగినంత వర్షం కురవలేదన్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా ఎండ తీవ్రత పెరిగిందన్నారు. దీంతో పంటలు ఎండి దెబ్బతినే పరిస్థితికి వచ్చాయన్నారు. పంట నష్ట అంచనా వేసేందుకే క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ హనుమంత రెడ్డి, ఏఓ విజయకుమార్, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

బీఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) పరిధిలో నిర్వహించిన బీటెక్, బీ ఫార్మసీ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ బి.చంద్రమోహన్‌రెడ్డి సోమవారం తెలిపారు. బీటెక్ ఒకటో సంవత్సరం ఒకటో సెమిస్టర్, అలాగే రెండో సెమిస్టర్ (ఆర్19), (ఆర్15) సప్లిమెంటరీ ఫలితాలు, బీ.ఫార్మసీ ఒకటో సంవత్సరం ఒకటో సెమిస్టర్, రెండో సెమిస్టర్, మూడో సంవత్సరం ఒకటో సెమిస్టర్, రెండో సెమిస్టర్ (ఆర్15) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయని పేర్కొన్నారు. ఫలితాల కోసం https://jntuaresults.ac.inను సందర్శించాలన్నారు.

దీవెన.. ఉన్నత విద్యకు నిచ్చెన

- జగనన్న విద్యాదీవెన సొమ్ము విడుదల
- జిల్లాలో 39,937 మంది విద్యార్థులకు లబ్ధి
- 36,600 మంది తల్లుల ఖాతాల్లోకి రూ.27.82 కోట్ల జమ



విద్యా దీవెన మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం అర్బన్: పేదింటి పిల్లలు ఉన్నత విద్యను ఉచితంగా అభ్యసించేందుకు 'జగనన్న విద్యా దీవెన' పథకం నిచ్చెనలాంటిదని కలెక్టర్ గౌతమి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఆశయానికి అనుగుణంగా బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. సోమవారం చిత్తూరు జిల్లా నగరిలో ఏర్పాటు చేసిన విద్యాదీవెన కార్యక్రమంలో ముఖ్యమంత్రి కంప్యూటర్ బటన్ నొక్కి ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్మును విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ ప్రమీల, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమాదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడారు. విద్యకు సీఎం పెద్దపీట వేస్తున్నారన్నారు. అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద, విద్యాకానుక, విద్యాదీవెన, వసతి దీవెన, ఇలా వివిధ పథకాల ద్వారా పేద విద్యార్థులకు తోడుగా నిలుస్తున్నారన్నారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేశారన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు పలు సంస్కరణలను తీసుకొచ్చారన్నారు. ముఖ్యంగా ఆర్థిక సమస్య కారణంగా పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో జగనన్న విద్యాదీవెన ద్వారా ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తున్నారన్నారు. పథకం కింద జిల్లాలో 39,937 మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.27.82 కోట్లు మంజూరయ్యిందన్నారు.

కేటగిరీ వారీగా లబ్ధిదారులు

కేటగిరీ	విద్యార్థులు	విద్యార్థుల తల్లులు	విద్యాదీవెన రూ.కోట్లలో
ఎస్సీ	7,483	6,804	5.24
ఎస్టీ	1,707	1,515	1.17
బీసీ	19,987	18,293	13.08
ఈబీసీ	4,850	4,511	4.26
ముస్లిం మైనారిటీ	3,720	3,413	2.44
కాపు	2,088	1,972	1.55
క్రిస్టియన్ మైనారిటీ	102	92	0.07
మొత్తం	39,937	36,600	27.82

ఈ మొత్తాన్ని 36,600 మంది తల్లుల ఖాతాల్లో సీఎం నేరుగా జమ చేశారన్నారు. ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి విద్యాదీవెన పథకానికి సంబంధించిన మెగా చెక్కును కలెక్టర్, ప్రజాప్రతినిధులు విడుదల చేశారు. కార్యక్రమంలో సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉన్నత చదువుకు అవకాశం



మా స్వస్థలం నంద్యాల. ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ 4వ సంవత్సరం చదువుతున్నాను. మాలాంటి పేద కుటుంబాలకు ఇంజినీరింగ్ చదివే ఆర్థికస్తోమత ఉండదు. జగనన్న విద్యాదీవెన ద్వారా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తుండడంతో ఎలాంటి ఇబ్బందీ లేకుండా ఉన్నత చదువును అభ్యసిస్తున్నాను. ఇప్పటి వరకు 9 విడతలు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద లబ్ధి పొందాను. మాలాంటి పేదలు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఆర్థిక తోడ్పాటును అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.
– ఎం. సాయిసుబ్బారావు, ఎస్కేయూ ఇంజనీరింగ్ కళాశాల

నాణ్యమైన పరిష్కారమే లక్ష్యం

- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: 'స్పందన', 'జగనన్నకు చెబుదాం' అర్జీలకు నాణ్యమైన పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్ఓ గాయత్రీదేవి, ఆర్డీఓ మధుసూదన్, డిప్యూటీ కలెక్టర్లు శ్రీనివాసులు, నీలమయ్య, శంకరయ్యలు ప్రజల నుంచి 407 అర్జీలు స్వీకరించారు. అనంతరం 'స్పందన', 'జగనన్నకు చెబుదాం' అర్జీల పరిష్కారంపై కలెక్టర్ సమీక్షించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలకు పరిష్కారం చూపించాలన్నారు. సమస్యను పరిష్కరించిన తరువాత అర్జీదారుకు ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. సమస్య పరిష్కారం కానిదైతే అదే విషయాన్ని అర్జీదారునికి వివరించి చెప్పడంతో పాటు లిఖిపూర్వకంగా ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని చెప్పారు. అర్జీల పరిష్కార క్రమంలో ఏస్థాయిలోనూ నిర్లక్ష్యానికి తావివ్వకూడదన్నారు.


అర్జీల్లో కొన్ని..
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో నీటి వసతి కల్పనకు చర్యలు తీసుకోవాలని ఏపీ పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ నాయకులు చిన్న ఆంజనేయులు, ఎస్సీ, ఎస్టీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు నెరిమెట్ల ఎల్లన్న, చెన్నకేశవులు, ఎర్రిస్వామి, ఓబుళపతి విన్నవించారు. బి.పప్పూరు గురుకుల పాఠశాలలో ల్యాప్‌టాప్‌లు, రూ.8 లక్షలు విలువ చేసే వస్తువులు చోరీకి గురయ్యాయని, దీనిపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

- తమ భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించడం లేదంటూ కళ్యాణదుర్గం మండలం ముదిగల్లుకు చెందిన రాఘవేంద్ర కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. సర్వే నంబరు 157–1లో ఐదు ఎకరాల వ్యవసాయ భూమిని 1996లో కొనుగోలు చేశామని చెప్పాడు. 23 ఏళ్లుగా సాగులో ఉన్నా ఆన్‌లైన్‌లో నమోదు చేయడం లేదన్నాడు.
- రోడ్డు స్థలాన్ని ఆక్రమించారని అనంతపురం రూరల్ మండలం ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన రమణమ్మ ఫిర్యాదు చేశారు. ఒక వ్యక్తి దౌర్జన్యంగా కాలనీలో రోడ్డును అక్రమించాడని, విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

రేపు సివిల్ సర్వీసెస్ క్రీడాకారుల ఎంపిక

అనంతపురం: సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్‌లో పాల్గొనే 19 క్రీడాంశాలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 30న జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్లు చీఫ్ కోచ్ నరసింహారెడ్డి తెలిపారు. జిల్లా స్థాయి జట్లకు ఎంపికైన సివిల్ సర్వీసెస్ ఉద్యోగులు గుంటూరు, విజయవాడలో సెప్టెంబర్ 4 నుంచి 8 వరకు జరిగే రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర స్థాయి క్రీడాంశాలు విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో, అథ్లెటిక్స్ గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీ గ్రౌండ్‌లో జరుగుతాయన్నారు. జిల్లాలో ఆసక్తి గల ఉద్యోగులు తమ వివరాలను ఇండోర్ స్టేడియం, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, అశోక్ నగర్, అనంతపురం. 08554–353223 నంబరుకు గానీ, రెజ్లింగ్ శిక్షకుడు నంబరు (8686919164)కు గానీ ఈ నెల 30లోపు తెలియజేయాలన్నారు.

డీఎంహెచ్‌ఓ బాధ్యతల స్వీకరణ




బాధ్యతలు తీసుకుంటున్న దేవి

అనంతపురం క్రైం: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌ఓ)గా డాక్టర్ ఈబీ దేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి రుయా ఆస్పత్రిలో డిప్యూటీ సివిల్ సర్జన్‌గా ఉన్న ఈమె పదోన్నతిలో భాగంగా అనంతపురం డీఎంహెచ్‌ఓగా నియమితులైన విషయం విదితమే. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్ నూతన డీఎంహెచ్‌ఓకు బాధ్యతలు అప్పగించారు. అనంతరం ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సుజాత, డాక్టర్ చెన్నకేశవులు, డాక్టర్ మహేంద్రనాథ్, డెమో ఉమాపతి, త్యాగరాజు, గంగాధర్ నూతన డీఎంహెచ్‌ఓకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేయాలన్నారు. ముఖ్యంగా మాతా, శిశు మరణాల నివారణ పట్ల ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. గర్భిణులకు సుఖప్రసవం జరిగేలా 108, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లను సద్వినియోగం చేసుకునేలా సిబ్బందికి సూచనలివ్వాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకనుగుణంగా ప్రజలకు సేవలందాలన్నారు. దోమకాటు వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సమష్టిగా పని చేసి ప్రజలకు ఉత్తమ వైద్య సేవలందిద్దామని పిలుపునిచ్చారు.

హెచ్‌ఎంఐఎస్ పోర్టల్‌పై అవగాహన
హెచ్‌ఎంఐఎస్ పోర్టల్‌పై జిల్లాలోని వివిధ ప్రైవేట్ నర్సింగ్ హోంల వైద్యాధికారులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ దేవి తెలిపారు. ఈ నెల 30న తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, కణేకల్‌లోని ఆస్పత్రులు, 31న అనంతపురం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రైవేట్ ఆస్పత్రుల్లోని వైద్యాధికారులకు పోర్టల్‌పై అవగాహన కల్పిస్తామని వెల్లడించారు.

సచివాలయాల్లో 'ఓపెన్' రిజిస్ట్రేషన్లు



అనంతపురం సిటీ: విద్యా సంస్థల్లో డ్రాపౌట్స్ సంఖ్య తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. చదువుకోవాలన్న తపన ఉన్నా.. వివిధ కారణాలతో బడి మానేసిన వారి కోసం ఓపెన్ టెన్త్, ఇంటర్ తరగతులు, పరీక్షలు నిర్వహించే వారు. దీన్ని మరింత సరళతరం చేస్తూ ఇక నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు సంబంధించి అందుబాటులో ఉన్న గ్రామ, వార్డు సచివాలయాల్లోనూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని పేర్కొంది. ఈ మేరకు ఉత్తర్వులు అందాయని అనంతపురం డీఎల్‌డీఓ చిలంకూరు ఓబుళమ్మ సోమవారం తెలిపారు.

అడ్మిషన్ ఎలా పొందాలంటే..
ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా అడ్మిషన్ తీసుకోవాల్సి ఉంటుందని డీఎల్‌డీఓ తెలిపారు. దీని కోసం ఓపెన్ స్కూల్ సొసైటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటికే ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఎలాంటి అదనపు రుసుము లేకుండా దరఖాస్తు చేసుకునేందుకు సెప్టెంబర్ 15 వరకు గడువు ఉందని తెలిపారు. అదనపు రుసుంతో కలిపి అక్టోబర్ 5 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

రేపు డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్


అనంతపురం టౌన్: డిమాండ్ల సాధనలో భాగంగా ఈ నెల 30, 31వ తేదీల్లో పెన్‌డౌన్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు డాక్యుమెంట్ రైటర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి సుధాకర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. డాక్యుమెంట్ రైటర్లకు లైసెన్స్‌ల పునరుద్ధరణ చేపట్టాలని, ఆన్‌లైన్ విధానాలు అమల్లోకి రావడంతో ఈ–స్టాంపింగ్ వెండర్లుగా డాక్యుమెంట్ రైటర్లకు ప్రత్యేక లైసెన్సులు జారీ చేయాలని కోరుతూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వివరించారు.

పేలుడు పదార్థాల వినియోగంపై కేసు నమోదు

చిలమత్తూరు: అడవి పందులను వేటాడేందుకు వినియోగించిన పేలుడు పదార్థం నమలడంతో దేమకేతేపల్లి నివాసి పాడి రైతు నరసింహప్పకు చెందిన ఆవు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ... ఆదివారం సాయంత్రం చిలమత్తూరులోని ఎస్సీ కాలనీ సమీపంలో రైతు పెద్దప్పయ్యకు చెందిన పొలాల్లో అడవి జంతువులను వేటాడేందుకు గుర్తు తెలియని వ్యక్తులు పేలుడు పదార్థాలు ఉంచారని, అవి నమిలి ఆవు చనిపోయిందన్నారు. జంతు హింస, పేలుడు పదార్థాలు వాడకం చట్ట విరుద్ధమన్నారు. ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఘటనకు సంబంధించి బాధితులను గుర్తించి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

జన భాషకు దివిటీ... గిడుగు

- వ్యవహారిక భాషా పితామహుడు జీవీ రామ్మూర్తి
- మాతృభాషతో పాటు బతుకు భాషకూ పట్టం


గిడుగు వెంకట రామ్మూర్తి

అనంతపురం కల్చరల్: తెలుగులో వాడుక భాషా ఉద్యమ పితామహుడు, గిడుగు వెంకట రామ్మూర్తి. గ్రాంథికభాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుకభాషలోకి తీసుకు వచ్చి, నిత్య వ్యవహారంలోని అందాన్నీ, సౌకర్యాన్నీ తెలియజెప్పిన మహనీయుడు.. వ్యవహారిక భాషోద్యమానికి మూలపురుషుడు ఆయన. బహుభాషా శాస్త్రవేత్తగా, చరిత్రకారుడిగా, సంఘసంస్కర్తగా, హేతువాదిగా, శిష్టజన వ్యవహారికభాషను గ్రంథ రచనకు స్వీకరింపజేసేలా చిత్తశుద్ధితో ఆయన చేసిన కృషి వల్ల ఏ కొద్ది మందికో పరిమితమైన చదువు వ్యవహారికభాషలో సాగి అందరికీ అందుబాటులోకి వచ్చింది. పండితులకే పరిమితమైన సాహిత్య సృష్టి, సృజనాత్మక శక్తి నేడు ప్రతి ఒక్కరికీ వీలైంది. గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని ఆగస్టు 29న 'తెలుగు భాషా దినోత్సవం'గా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

తెలుగును ప్రేమిద్దాం.. పరభాషను గౌరవిద్దాం

తెలుగువాడివై తెలుగు రాదనుచు
సిగ్గులేక ఇంక చెప్పుటెందుకురా
దేశ భాషలందు తెలుగు లెస్సయటంచు
తెలుగు బిడ్డా! యెపుడు తెలుసుకుందువురా?

... అన్న ప్రజాకవి కాళోజి మాటలు మనస్సుకు కాస్త చురుక్కు మనవచ్చు కానీ.. తెలుగు భాషపై మమకారం తరిగి పోకుండా ఉండేందుకు ఆయన పడిన తపనకు నిదర్శనమిది. తెలుగంటే కేవలం అచ్చులు.. హల్లులు కాదు. తెలుగంటే అమ్మభాష. పరభాష వ్యామోహంలో మాతృభాషను మృతభాషగా మార్చకుండా చూడాల్సిన బాధ్యత తెలుగువాడిగా పుట్టిన ప్రతి ఒక్కరిపై ఉంది. భోగరాజు పట్టాభిరామయ్య తెలుగులో సంతకం పెట్టినందుకు ఆ చెక్కును అంగీకరించలేదన్న ఒకేఒక్క కారణమే ఆంధ్రా బ్యాంక్ ఆవిర్భావానికి కారణమైంది. అయితే తెలుగు మాట్లాడినా.. రాసినా.. ఉద్యోగాలు రావనే అపోహ చాలా కాలంగా అందరిలోనూ పాతుకుపోయింది. ఇంగ్లిష్ నేర్చుకుంటే దేశవిదేశాల్లో ఎక్కడైనా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరుకుతాయని ప్రతి ఒక్కరూ భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో బతుకు భాష ఇంగ్లిష్‌ను గౌరవిద్దాం.. అదే సమయంలో మాతృభాష అంతర్ధానం కాకుండా కాపాడుకుందామంటూ పలువురు సాహితీవేత్తలు పిలుపునిస్తున్నారు. రాష్ట్రంలోని జగన్ సర్కార్ సైతం ఇదే పంథాను అనుసరిస్తోంది. ఓ వైపు తెలుగుకు ప్రాధాన్యతనిస్తూనే ప్రభుత్వ బడుల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టి బతుకు భాషను నిరుపేదలకు చేరువ చేసింది. సీఎం వైఎస్ జగన్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని చాలా మంది స్వాగతిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగుతో పాటు ఆంగ్ల మాధ్యమానికి జేజేలు పలికారు.

శోభాయాత్ర

తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఉదయం 9 గంటలకు భాషా పండితులతో శోభాయాత్ర నిర్వహించనున్నారు. ఈ మేరకు తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ బి.నారాయణ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అనంతపురంలోని కేఎస్ఆర్ ప్రభుత్వ పాఠశాల నుంచి తెలుగుతల్లి విగ్రహం వరకూ తెలుగు తల్లిని కీర్తించే గీతాలతో ర్యాలీ జరుగుతుంది.

తెలుగు పద్యగానం

తెలుగు భాషకు విశేష సేవలందించిన గిడుగు రామ్మూర్తి సేవా నిరతిని చాటిచెప్పేలా మంగళవారం సాయంత్రం 6 గంటలకు తెలుగు పద్యగానం నిర్వహించనున్నారు. ఈ మేరకు వేమన ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలోని వేమనా ఫౌండేషన్ కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

సందర్భం

నేడు తెలుగు భాషా దినోత్సవం



తెలుగుతో పాటు ఇంగ్లిషూ ఉండాలి



తెలుగు భాష అంటే అందరికీ ఇష్టం. ప్రభుత్వం కూడా ప్రథమ భాషగా తెలుగును గుర్తించి గౌరవిస్తోంది. కానీ ఇంగ్లిష్‌ను ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధాన అంశంగా ఉండాలని శతాబ్దాలుగా కొన్ని జాతులు కోరుకుంటున్నాయి. కానీ కొందరు ఫాసిస్టు భావజాలమున్నవారు అణగారిన వర్గాలకు ఇంగ్లిష్ చదువులు వద్దని ప్రచారం చేయడం దారుణం.
– కృష్ణమూర్తి, మహాబోధి సాహిత్య వేదిక

పేద పిల్లలు రాణిస్తున్నారు



ఎప్పటి నుంచో కోరికగా ఉన్న ఇంగ్లిష్ మాధ్యమాన్ని ప్రభుత్వం పేదింటి ముంగిటకు తెచ్చింది. దీంతో పేద పిల్లలు అన్నింటా రాణిస్తున్నారు. ఇది ఎంతో శుభపరిణామం. తెలుగును ప్రేమిద్దాం... ఇంగ్లిష్‌నూ గౌరవిద్దాం. ఇదే నినాదంతో ఈ ఏడాది తెలుగు భాషా దినోత్సవాన్ని జరుపుకోవాలని నిర్ణయించాం.
– తరిమెల అమరనాథరెడ్డి, సీనియర్ రచయిత

సత్వర న్యాయం చేకూర్చండి : ఎస్పీ

- 'పోలీసు స్పందన'కు 96 వినతులు


సమస్యపై సంబంధిత ఎస్‌హెచ్‌ఓతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: బాధితుల సమస్యలకు చట్టపరిధిలో సత్వర పరిష్కారం చూపాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 96 వినతులు అందాయి. ఎస్పీ శ్రీనివాసరావు స్వయంగా అర్జీలు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. అనంతరం సమస్య తీవ్రతను సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు వీడియో కాన్ఫరెన్స్‌లో వివరించి, తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఒకసారి వచ్చిన సమస్యపై తిరిగి పిటిషన్ స్పందనకు రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి పోలీసు అధికారిపై ఉందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ విజయ భాస్కర్‌రెడ్డి, సెబ్ సీఐ ఇందిర పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి మెరిట్ జాబితా విడుదల

అనంతపురం అర్బన్: విభిన్న ప్రతిభావంతుల బ్యాక్‌ల్యాగ్ పోస్టుల భర్తీకి వెలువడిన నోటిఫికేషన్‌ను అనుసరించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు కలెక్టర్ గౌతమి ప్రకటించారు. ఇందుకు సంబంధించి వివరాలను సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ జాబితాను కలెక్టర్ కార్యాలయంలోనూ, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ కార్యాలయంలోనూ అందుబాటులో ఉంచామన్నారు. అదే విధంగా జిల్లా వెబ్‌సైట్ http://ananthapuramu.ap. gov.in లోనూ ఉంచామని తెలిపారు. అభ్యర్థులు జాబితాను పరిశీలించుకుని ఏవైనా ఆక్షేపణలు ఉంటే రాతపూర్వకంగా ఆధారాలతో సమర్పించాలని సూచించారు.

పాముకాటుతో వ్యక్తి మృతి


మృతుడు మల్లన్న

రొళ్ల: మండలంలోని పి.గొల్లహట్టికి చెందిన ఎ.మల్లన్న(45) పాముకాటుతో మృతి చెందాడు. గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్న ఆయనకు భార్య కరియమ్మతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ నెల 18న గొర్రెలను రంగనపల్లి చెరువు వద్దకు మేపునకు తీసుకెళ్లినప్పుడు పాము కాటు వేసింది. అప్పటి నుంచి బెంగళూరులోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన... పరిస్థితి విషమించడంతో సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థిని చితక బాదిన టీచర్


చికిత్స పొందుతున్న బాబు

రాయదుర్గం: టీచర్ చితకబాదడంతో 1వ తరగతి చదువుతున్న విద్యార్థి ఆస్పత్రి పాలయ్యాడు. వివరాల్లోకెళ్లితే.. గుమ్మఘట్ట మండలం రంగచేడుకు చెందిన రమేష్ కుమారుడు రాయదుర్గంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 1వ తరగతి చదువుతున్నాడు. జ్వరం కారణంగా రెండు రోజులుగా పాఠశాలకు హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థిని హోమ్‌వర్క్ చేయలేదన్న కారణంతో క్లాస్ టీచర్ చితకబాదాడు. దీంతో అస్వస్థతకు గురికావడంతో పాఠశాల యాజమాన్యం విద్యార్థి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. చికిత్స కోసం రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. కాగా, విద్యార్థి గుండె సంబంధిత రుగ్మతతో బాధపడుతున్నట్లు సమాచారం. వైద్యుల సూచన మేరకు పాఠశాల మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తీసుకెళ్లారు.

సెల్ టవర్ ఎక్కిన ఆర్ఎంపీ

- ఏడాది క్రితం సైబర్ నేరగాళ్ల చేతిలో రూ.15లక్షలు మోసపోయిన వెంకటేష్
- ఫిర్యాదు చేసినా పోలీసులు న్యాయం చేయలేదంటూ ఆవేదన

పుట్లూరు: సైబర్ నేరగాళ్ల చేతిలో రూ.15లక్షలు మోసపోయిన ఓ ఆర్ఎంపీ.. తనకు పోలీసులు న్యాయం చేయలేదంటూ సోమవారం సెల్‌టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. వివరాలు.. పుట్లూరు మండలం ఎ.కొండాపురంలో ఆర్ఎంపీగా జీవనం సాగిస్తున్న వెంకటేష్‌కు సెల్‌ఫోన్‌కు గత ఏడాది లక్కీ డ్రాలో కారు గెలుచుకున్నట్లు సంక్షిప్త సమాచారం అందింది. దీనిని చూసిన ఆయన అందులో పేర్కొన్న నంబర్‌ను సంప్రదించారు. అనంతరం పలు దఫాలుగా రూ.15 లక్షలను అవతలి వ్యక్తి ఖాతాకు మళ్లించారు. అయినా కారు అందకపోవడంతో అనుమానం వచ్చి నిలదీస్తే అవతలి వ్యక్తి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన వెంకటేష్.. వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నెలలు గడుస్తున్నా ఈ కేసులో పురోగతి లేకపోవడంతో మనస్తాపం చెందిన ఆయన సోమవారం ఉదయం సెల్ టవర్ ఎక్కి తనకు న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పుట్లూరు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ అక్కడకు చేరుకుని వెంకటేష్‌కు నచ్చజెప్పి కిందకు దిగేలా చేశారు. సైబర్ నేరంపై కేసు నమోదైందని, బ్యాంకు ఖాతాలో ఫ్రీజ్ చేయించిన రూ.2లక్షలను అందించేలా చర్యలు తీసుకుంటున్నామని భరోసానిచ్చారు.

జేసీ... ఇక నీవు భిక్షమెత్తుకోవాల్సిందే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి


వేదికపై ఎమ్మెల్యేతో పాటు ఆసీనులైన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఎమ్మెల్యేలు శంకరనారాయణ, అనంత వెంకట్రామిరెడ్డి, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, తదితరులు

- తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి
- యాడికి మండలంలో ముగిసిన ప్రజాసంక్షేమ పాదయాత్ర

పెద్దపప్పూరు: రాజకీయంగా వెంటిలేటర్‌పై ఉన్న జేసీ ప్రభాకరరెడ్డి భవిష్యత్తులో భిక్షమెత్తుకోవాల్సిందేనని, ఇందుకోసం ఇప్పటి నుంచే పట్టణాభివృద్ధి కోసమంటూ వీధుల్లో అడుక్కోవడం మొదలు పెట్టారని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మండిపడ్డారు. ఇది ఆయనకు భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుందని ఎద్దేవా చేశారు. యాడికి మండలంలో ప్రజాసంక్షేమ పాదయాత్ర సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా యాడికిలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ, ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

జేసీపీఆర్‌కు మతి భ్రమించింది

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెద్దారెడ్డి మాట్లాడుతూ.. తాడిపత్రి నియోజకవర్గంలో 40 ఏళ్ల రాజకీయ పదవులు అనుభవించిన జేసీ సోదరులు ఈ ప్రాంత అభివృద్ధికి చేసింది ఏమీ లేదన్నారు. వీరి దౌర్జన్యాలతో విసుగు చెందిన ప్రజలు 2019లో తిరుగులేని సమాధానంతో ఇంటికే పరిమితం చేయడంతో జేసీ ప్రభాకరరెడ్డికి మతిభ్రమించిందన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వంపై, వైఎస్సార్‌సీపీపై ఆరోపణలు చేయడమే పనిగా పెట్టుకుని, అధికారులను వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ఇప్పటి వరకూ పెద్దపప్పూరు, పెద్దవడుగూరు, తాడిపత్రి, యాడికి మండలాల్లో ప్రజాసంక్షేమ పాదయాత్ర దిగ్విజయంగా సాగిందన్నారు. దమ్ముంటే జేసీ ప్రభాకర రెడ్డి ఒకరి సాయం లేకుండా కనీసం 3 కిలోమీటర్ల పాదయాత్ర చేయాలని సవాల్ చేశారు.

ఖనిజ సంపదను దోచేశారు

అధికారాన్ని అడ్డుపెట్టుకుని యాడికి మండలం కోనుప్పలపాడు సమీపంలో త్రిశూల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామంటూ 1,250 ఎకరాలు అప్పటి ప్రభుత్వం నుంచి లీజుకు తీసుకుని ఫ్యాక్టరీ ఏర్పాటు చేయకుండా నిరుద్యోగులను మోసం చేసిన నీచమైన చరిత్ర జేసీ సోదరులదని పైలా నరసింహయ్య విమర్శించారు. అప్పట్లో రాజకీయ పలుకుబడితో ఖనిజ సంపదను అడ్డగోలుగా దోచుకున్నారని గుర్తు చేశారు.

- నాలుగు దశాబ్దాల పాటు తాడిపత్రి నియోజకవర్గానికి పట్టిన శని 2019లో ఓటర్ల దెబ్బకు విరగడైందని ఎమ్మెల్యే శంకరనారాయణ అన్నారు.
- కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను దరిచేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి కొనియాడారు.
- తెలంగాణలోని గద్వాల్‌లో జేసీ సోదరుల అరాచకాలు తట్టుకోలేక అక్కడి వారు తరిమేయడంతో తాడిపత్రి ప్రాంతానికి వలస వచ్చారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి గుర్తు చేశారు. ప్రస్తుతం జేసీ ప్రభాకరరెడ్డి దెబ్బకు తట్టుకోలేక అన్న జేసీ దివాకర్ రెడ్డి ఇల్లు విడిచి దూరంగా నివాసముంటున్నారన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసిన రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపును అడ్డుకోవడం ఎవరి తరం కాదన్నారు.

కార్యక్రమంలో డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత, మాజీ చైర్మన్ పామిడి వీరా, యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్, ఎంపీపీ బొంబాయి ఉమాదేవి, యాడికి సర్పంచ్ అనురాధ, ఉప సర్పంచ్ కాసా చంద్రమోహన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్రామిరెడ్డి, సీనియర్ నాయకులు బాల రమేష్‌బాబు, బోగతి బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ ఆహార మాయలో ఆధునిక సమాజం

- డాక్టర్ ఖాదర్‌వలి



మాట్లాడుతున్న ఖాదర్‌వలి

రాప్తాడురూరల్: కార్పొరేట్ ఆహార మాయలో ఆధునిక సమాజం కూరుకుపోయిందని కృషిరత్న పద్మశ్రీ డాక్టర్ ఖాదర్‌వలి ఆందోళన వ్యక్తం చేశారు. అనంతపురం ఆర్ట్స్ కళాశాల బోటనీ విభాగం, పర్యావరణ క్లబ్ సంయుక్తంగా సోమవారం 'సిరి ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. రోజూ మనం తీసుకునే ఆహారంలో అనేక రకాల విషపూరిత పదార్థాలు ఉంటున్నాయన్నారు. వీర్య కణాల వృద్ధి లేక సంతోనోత్పత్తి బాగా తగ్గుతుందన్నారు. వరి, గోధుమ, చక్కెర వంటి వాటిని వదిలేస్తే ఆస్పత్రికి వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. వీటి స్థానంలో సంప్రదాయ తృణ ధాన్యాలను తీసుకోవాలన్నారు. పుట్టబోయే పిల్లల్లో అనేక రకాల సమస్యలు రావడానికి కారణం మనం తీసుకునే ఆహారమేనన్నారు. ఆడపిల్లల్లో జరుగుతున్న అనేక మార్పులు, గైనకాలజీ సమస్యలకు కారణం ఈ రోజు తీసుకుంటున్న పాలేనన్నారు. పాలు తీసుకోవడం ఆర్నెళ్లు ఆపేస్తే గైనకాలజీ సమస్యలు ఏవీ ఉండవన్నారు. నేటి ప్రపంచం విజ్ఞానం పేరుతో మానవజాతి నిత్యం తీసుకునే ప్రతి దానిని వ్యాపారం చేస్తోందన్నారు. విజ్ఞానం సరియైన దారిలో వెళ్లడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. టీవీ ప్రకటనలు, కార్పొరేట్ మాయాజాలానికి మోసపోవద్దని కోరారు. కేవలం మన సంప్రదాయ ఆహారాన్ని తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఏసీఆర్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితుల్లో ఆహార అలవాట్లను మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయ ప్రాధాన్యత పెరగాలని ఆకాంక్షించారు. అనంతరం ఖాదరవలీని సన్మానించారు. కార్యక్రమంలో పర్యావరణ క్లబ్ కన్వీనర్ డాక్టర్ బి. మనోహర్ రెడ్డి, వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఈ. శ్రీదేవి, సభ్యులు డాక్టర్ రఘురాములు, వైస్ ప్రిన్సిపాల్ శశాంక్ మౌలాలి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఖాదర్‌వలీ సదస్సులు

అనంతపురం అగ్రికల్చర్: సిరిధాన్యాలు, పర్యావరణ పరిరక్షణ, మధుమేహర హిత జీవనం తదితర అంశాలపై మంగళవారం సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు విశ్రాంత ప్రొఫెసర్ గంగిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 8.30 గంటలకు రెడ్స్ ఆధ్వర్యంలో రూరల్ మండలం కురుగుంటలోని మహిళా రైతుల సామూహిక వ్యవసాయ క్షేత్రంలో సదస్సు ఉంటుంది. ప్రఖ్యాత శాస్త్రవేత్త, కృషిరత్న డాక్టర్ ఖాదర్‌వలీ ముఖ్య అతిథిగా హాజరై సిరిధాన్యాల ఆవశ్యకతను వివరించనున్నారు. కలెక్టర్ ఎం.గౌతమి, డీఐజీ అమ్మిరెడ్డి ఆత్మీయ అతిథులుగా హాజరు కానున్నారు. అనంతరం ఉదయం 11 గంటలకు ప్రభుత్వ కళాశాల డ్రామా హాలులో పర్యావరణ పరిరక్షణపై సదస్సు ఉంటుంది. సాయంత్రం 6.30 గంటలకు స్థానిక ద్వారాకా విల్లాస్‌లోఉన్న క్లబ్ హౌస్‌లో జరిగే సదస్సులో ఖాదర్‌వలి పాల్గొంటారు.

ఖాతాదారులకు సత్వర సేవలు


సరళ రుణ వితరణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాకేష్ కశ్యప్

ప్రశాంతి నిలయం: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ఖాతాదారులకు సత్వర సేవలు అందిస్తున్నట్లు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ రాకేష్ కశ్యప్ పేర్కొన్నారు. పుట్టపర్తిలోని ఏపీజీబీ శాఖలో సరళ రుణ వితరణ కేంద్రం –2ను సోమవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. సరళ రుణ వితరణ కేంద్రం ద్వారా వివిధ రుణాలను సత్వరమే మంజూరు చేస్తారన్నారు. కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణులకు బ్యాంకింగ్ సేవలు అందించడంలో ఏపీజీబీ అన్నింటా ముందంజలో ఉందన్నారు. రైతులకు పంట, యంత్ర కొనుగోలు రుణాలతో పాటు విద్య, ఉపాధికి సంబంధించిన రుణాలను సైతం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీజీబీ ఆర్ఎం రవీంద్రారెడ్డి, స్థానిక ఆ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణగౌడ్, సరళ రుణ వితరణ కేంద్రం సీనియర్ మేనేజర్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మహనీయుడు సత్యసాయి

- కేరళ ప్రభుత్వ అడిషనల్ చీఫ్ సెక్రటరీ జ్యోతిలాల్


ప్రసంగిస్తున్న కేరళ ప్రభుత్వ అడిషనల్ చీఫ్ సెక్రటరీ జ్యోతిలాల్

ప్రశాంతి నిలయం: సత్యం, ధర్మం, శాంతి, ప్రేమలను బోధిస్తూ ప్రపంచ మానవాళిని సన్మార్గంలో నడిపిన మహనీయుడు సత్యసాయి అని కేరళ ప్రభుత్వ అడిషనల్ చీఫ్ సెక్రటరీ జ్యోతిలాల్ కొనియాడారు. ప్రశాంతి నిలయంలో ఓనం సంబరాలు రెండో రోజు సోమవారం కూడా అంబరమంటాయి. కేరళ రాష్ట్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ జయకుమార్, కేరళ విద్యుత్ శాఖ అడిషనల్ చీఫ్ సెక్రటరీ జ్యోతిలాల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. వేడుకల్లో భాగంగా మహాసమాధి చెంత సత్యసాయి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చీఫ్ సెక్రటరీ జ్యోతిలాల్, డైరెక్టర్ జయకుమార్ మాట్లాడుతూ సత్యసాయి చూపిన మార్గం సదా అనుసరణీయమన్నారు. అనంతరం బాలవికాస్ కేరళ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సంగీత కచేరీతో అలరించారు.

క్లుప్తంగా

పాపంపేటలో అభివృద్ధి పనులకు శ్రీకారం



డ్రైనేజీ పనులు చేస్తున్న జేసీబీ వాహనం

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. సోమవారం పనులు ప్రారంభమయ్యాయి. ఎంపీపీ వరలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు వెంకటేశ్వర్లు, సందీప్ యాదవ్, పంచాయతీ కార్యదర్శి అశోక్‌బాబు తదితరులు పనులను పర్యవేక్షించారు. ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చొరవతో ఈ ప్రాంతానికి 5 కిలో మీటర్లు సీసీ రోడ్లు, 5 కిలోమీటర్ల డ్రైనేజీ కాలువలు, 5 కిలోమీటర్ల మట్టిరోడ్లు మంజూరయ్యాయన్నారు. గతంలో పదేళ్ల పాటు పరిటాల సునీత ఎమ్మెల్యే, మంత్రిగా పని చేసినా అభివృద్ధి ఎలాంటి పనులు చేపట్టలేదన్నారు. ప్రకాష్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అతి త్వరలోనే పీఏబీఆర్ నీటిని తెప్పిస్తున్నారన్నారు. ఇందుకోసం పైపులైను పనులు కూడా ప్రారంభమవుతాయన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు మాదన్నయాదవ్, మునిశంకరయ్య, గోపాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఈశ్వరయ్య,లాలెప్ప పాల్గొన్నారు.

సత్యసాయి నీటి సరఫరా కార్మికుల నిరసన



ఆత్మకూరులో నిరసన తెలుపుతున్న సత్యసాయి నీటి సరఫరా సిబ్బంది

ఆత్మకూరు: జీతాలు ఇవ్వాలని మండలంలోని సత్యసాయి నీటి సరఫరా కార్మికులు నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ తమ సమ్మె సోమవారంతో నాల్గో రోజుకు చేరిందన్నారు. కార్యక్రమంలో నీటి సరఫరా కార్మికులు చిన్నా, తిరుపాల్ నాయక్, శ్రీరాములు, హరి, ఓబన్న, వీరయ్య, వెంకటేష్, కేశవ, శ్రీదర్, మల్లి తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం కదిలిన రామదండు



సీతారాముల చిత్రపటంతో భజనలు చేస్తూ నడుస్తున్న రామదండు

అనంతపురం రూరల్: వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలతో ప్రజలు సంతోషంగా ఉండాలని కాటిగానికాలువకు చెందిన రామదండు భజన బృందం పూజలు చేశారు. సోమవారం కట్టకిందపల్లి, రుద్రంపేట, ప్రసన్నాయపల్లి, అయ్యవారిపల్లి తదితర గ్రామాల మీదుగా సీతారాముల చిత్రపటాన్ని ఊరేగిస్తూ భజనలు చేశారు. భజన బృందం సభ్యులు మాట్లాడుతూ రామదండుగా ఏర్పడి ఊరూరా తిరిగి భజనలు చేస్తే వర్షాలు కురుస్తాయన్న నమ్మకంతో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, భజనలు చేశామన్నారు.

ఆర్డీటీ బాలికల అథ్లెటిక్స్ ప్రారంభం



ఆర్డీటీ క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులు

అనంతపురం: గ్రామీణ బాలికల అథ్లెటిక్స్ కేంద్ర స్థాయి పోటీలు అనంతపురం క్రీడా గ్రామంలో (ఏఎస్‌వీ) ఆది, సోమవారాల్లో రెండో రౌండ్ ఈవెంట్లు ప్రారంభమయ్యాయి. రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) తన స్పోర్ట్ ఫర్ డెవలప్‌మెంట్ సెక్టార్ ద్వారా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటారు. కార్యక్రమంలో సాయి కృష్ణ స్పోర్ట్ ఫర్ డెవలప్‌మెంట్, ఆర్డీటీ, డైరెక్టర్, ఏఎస్‌ఏ మేనేజర్ శ్రీదేవి, ఏఎస్‌ఏ అకాడమీ డెవలప్‌మెంట్ మేనేజర్ వంశీ ఒరిగంటి, ఏఎస్‌ఏ గ్రాస్‌రూట్ కోఆర్డినేటర్ వంశీకృష్ణ, టెన్నిస్ కోఆర్డినేటర్ విశాల్ విజయ్‌కుమార్, టెక్నికల్ టీమ్ సురేష్, భరత్, చలపతి, ఫుట్‌బాల్ కోఆర్డినేటర్ కిషోర్‌కుమార్, కోచ్‌లు అనిల్‌కుమార్, చౌడేశ్వర్ ప్రసాద్, రామయ్య, హరి, నరసింహ, ప్రవీణ్, ఆర్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

అనంతపురం క్రైం: తల్లిదండ్రులను కోల్పోయిన ముగ్గురు చిన్నారులకు మహాలక్ష్మి సేవా ట్రస్ట్, బెస్ట్ ఫ్రెండ్స్ సొసైటీ సేవా సహృదయ సమితి ఆధ్వర్యంలో రూ.20వేలు సోమవారం అందించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సుజాత, శ్రీదేవి, దీపిక, చంద్ర, బాలకృష్ణ, అమర్, శబరి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ రహదారిపై హెవీలోడ్‌తో వెళ్తున్న లారీ టాపుపై కూర్చున్న హమాలీలు



గుత్తిరోడ్డులో కూలీలను తీసుకెళ్తూ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతున్న బొలెరో వాహన డ్రైవర్

పట్టుతప్పితే ప్రమాదమే!

ప్రతి వాహనదారుడూ రోడ్డు నిబంధనలు పాటించండి..గమ్యస్థానాలకు సురక్షితంగా చేరండి.. ఇవీ పోలీసులు, రోడ్డు భద్రత, రవాణాశాఖ అధికారులు పదేపదే చెప్పే జాగ్రత్తలు. అయితే వారి సూచనలు వాహనదారులు పెడచెవిన పెడుతూ ప్రమాదాలను కోరితెచ్చుకుంటున్నారు. అధిక లోడుతో ప్రయాణం క్షేమం కాదు.. మొబైల్‌లో మాట్లాడుతూ వాహనం నడపడం అత్యంత ప్రమాదకరమని సూచించే బోర్డులు అడుగడుగునా ఉన్నా అజాగ్రత్త వల్ల జీవితాలను బుగ్గి చేసుకుంటున్నారు. గుత్తి – అనంతపురం జాతీయ రహదారిపై సోమవారం పలు వాహనాల్లో ప్రమాదకర ప్రయాణం చేస్తూ కనిపించారు. అధిక లోడుతోపాటు, ఫుట్‌బోర్డుపైన ప్రయాణిస్తూ కూలీలు, సెల్‌ఫోన్లో మాట్లాడుతూ కూలీలను తీసుకెళ్లే వాహనం నడుపుతూ డ్రైవర్.. ఇలా వెళ్తుండడాన్ని చూసి స్థానికులు, వాహనదారులు పట్టుతప్పితే ప్రమాదకరమే అని చర్చించుకోవడం కనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం :

నేడు పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట



పొలిమేర పెద్దమ్మ తల్లి గ్రామోత్సవం



జ్యోతులు పట్టిన మహిళలు

ఆత్మకూరు: మండల కేంద్రంలో సోమవారం పొలిమేర పెద్దమ్మతల్లి గ్రామోత్సవం నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్ట చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ముందుగా ప్రత్యేక పూజలు చేసి, మహిళలు జ్యోతులను పట్టుకొని గ్రామోత్సవం చేశారు. ఆలయం వద్ద ప్రాతఃకాల పూజ, దీక్షాహోమం, మూల మంత్ర జపములు, మహా స్నాపనం తదితర పూజలు నిర్వహించారు. పొలిమేర పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మంగళవారం ఉదయం 10 గంటలకు ఉంటుందని గ్రామపెద్దలు, నిర్వాహకులు తెలిపారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

పంట సాగులో సూచనలు తప్పనిసరి



పంటలకు సూచనలు తెలియజేస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

ఆత్మకూరు: పంటల సాగులో సూచనలు, మెలకువలు తప్పనిసరిగా పాటించాలని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. సోమవారం ఆత్మకూరు గ్రామం వద్ద సాగు చేసిన వేరుశనగ, ఆముదం, కంది పంటలను వ్యవసాయ ప్రధాన శాస్త్రవేత్తలు పద్మలత, అశోక్‌కుమార్, ఏడీఏలు ఆత్మశ్రీ, రవి పంటలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ వర్షాధార పంటలయిన వేరుశనగ, కంది, ఆముదం, పత్తి, ఇతర పంటలు నీటి ఎద్దడికి గురైనట్లు తెలిపారు. రైతులు పోటాషియం నైట్రేట్ 13:00: 45, 5 గ్రాములు లేదా 19:19:19 ఎరువులు లేదా యూరియా పది గ్రాములు చొప్పున ఒక లీటరు నీటికి కలిపి, వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. రైతులు అంతర కృషి చేయడం వల్ల నేల తేమను సంరక్షించడానికి, కలుపుమొక్కలు తొలగించడానికి ఉపయోగపడుతుందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా పంటలను ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని ఏడీఏ రవి తెలిపారు. కార్యక్రమంలో ఏఓ సుచరిత, ఏఈఓ సుజిత తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆకస్మిక మృతి



లలిత చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సంస్థ సిబ్బంది

అనంతపురం: విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎస్.లలిత ఆకస్మికంగా మృతి చెందినట్లు గ్రంథాలయసంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమామోహన్ రెడ్డి తెలిపారు. స్థానిక జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో సిబ్బంది సంతాపం తెలియజేశారు. ఎల్ఎం ఉమామోహన్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శిగా లలిత ఐదేళ్లపాటు పనిచేశారన్నారు. ఆమె ఆకస్మిక మరణం దిగ్భ్రాంతికి గురి చేసినట్లు తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యదర్శి లలిత చిత్ర పటానికి నివాళులర్పించారు.

సెప్టెంబర్ 12,13 తేదీల్లో మహాసభలు

రాప్తాడురూరల్: నెల్లూరు జిల్లాలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో జరిగే అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర నిర్మాణ మహాసభలు ఉంటాయని సంఘం నాయకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్ రెడ్డి చేతులమీదుగా సోమవారం విడుదల చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్, రమణయ్య, ఈ కుల్లాయిస్వామి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 545 ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి ఆనంద్ కుమార్, నాయకులు నారాయణస్వామి, వంశీ, మంజు, గణేష్, ఆనంద్, విశ్వ, ఉపేంద్ర, ప్రవీణ్, అజిత్, అరుణ్ కుమార్, కరుణాకర్ పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

నార్పల: మహిళల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వైకేపీ కార్యాలయంలో కుల్లాయిస్వామి మండల సమాఖ్య 19వ వార్షికోత్సవ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. పథకాల నగదు కూడా మహిళల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు వెల్లడించారు. ఇంత చేస్తున్న జగనన్నను టీడీపీ, జనసేన నాయకులు విమర్శించడం తగదన్నారు. అనంతరం మండల సమాఖ్యకు కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ఫర్వీన్, కార్యదర్శిగా నారమ్మ, కోశాధికారిగా రామలక్ష్మి తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ లక్ష్మీనరసింహా, ఏపీఎం తిప్పమ్మ, సీడీపీఓ భారతి తదితరులు పాల్గొన్నారు.

కర్బన కాలుష్యం తగ్గించడమే ధ్యేయం



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఎఫ్ ఎకాలజీ సిబ్బంది

రాప్తాడు: కర్బన కాలుష్యాన్ని తగ్గించి రైతులకు ఆదాయం కల్పించడమే ధ్యేయమని ఏఎఫ్ ఏకాలజీ సెంటర్ క్షేత్ర స్థాయి సూపర్‌వైజర్ అరుణకుమారి తెలిపారు. సోమవారం ఎం.బండమీదపల్లి గ్రామంలో కర్బన మదనంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ వాతావరణంలో కార్బన్ విష వాయువును చెట్లలో బంధించి కాలుష్యన్ని తగ్గించి, పరోక్షంగా రైతులకు అదనపు ఆదాయం కల్పించే దిశగా ఏఎఫ్ ఎకాలజీ కృషి చేస్తోందన్నారు. రైతులకు ఎర్రచందనం, మహాగని, టేకు, మత్తి, శ్రీగంధం విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఫ్ ఎకాలజీ ఫీల్డ్‌కోఆర్డినేటర్ శంకర్, కౌన్సిల్ మెంబర్స్ గోపాల రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, నరేంద్ర, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో ఉద్యమం



విద్యుత్ ఉద్యమంలో మరణించిన వారి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

అనంతపురం అర్బన్: విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా 2000లో జరిగిన ఉద్యమంలో మరణించిన వారి స్ఫూర్తితో ఉద్యమాలు కొనసాగిస్తామని వామపక్ష పార్టీల నాయకులు అన్నారు. విద్యుత్ ఉద్యమంలో మరణించిన రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డి సంస్మరణ సభ స్థానిక టవర్‌క్లాక్ వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేశాయి. సీపీఎం జిల్లా కార్యదర్శి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఐ, సీపీఐ ఎంఎల్, న్యూడెమోక్రసీ, ఎస్‌యూసీఐ పార్టీల ప్రధాన క్యాదర్శులు జాఫర్, పెద్దన్న, ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి, రాఘవేంద్ర పాల్గొన్నారు. మరణించిన వారి చిత్రపటాలకు పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ 23 ఏళ్ల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీల భారాన్ని వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీలు నిర్వహించిన పోరాటం రాష్ట్ర రాజకీయ చరిత్రను మార్చిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్‌కు అనుకూల విధానాలతో విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించేందుకు నూతన విద్యుత్ చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలరంగయ్య, సావిత్రి, రామిరెడ్డి, ఆర్‌వీ నాయడు, వెంకటనారాణ, శ్రీరాములు, అల్లీ పీరా, రమణయ్య, చంద్రశేఖర్, మల్లీశ్వరి, నాగరాజు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో అధికారుల పర్యవేక్షణ లోపం



ఇష్టారాజ్యంగా ఫేవర్ బ్లాక్ పనులను చేపడుతున్న కూలీలు

అనంతపురం క్రైం: నగరంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత అభివృద్ధి పరుగులు పెడుతోంది. ప్రభుత్వం నగర సుందరీకరణతోపాటు అభివృద్ధి పనులకు రూ.వందల కోట్లు వెచ్చిస్తోంది. ఇలాంటి తరుణంలో నగరపాలక సంస్థలోని ఇంజినీర్లు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఎదుట రూ.10 లక్షలతో లేయింగ్ ఆఫ్ పేవర్ బ్లాక్స్ (ఎస్ క్యాప్ నిధులు) పనులు జరుగుతున్నాయి. పనులు జరిగే సమయంలో ఇంజినీర్లు పర్యవేక్షించాల్సి ఉంది. కనీసం అమినిటీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ అయినా ఉండాలి. కానీ అధికారులు పూర్తి బాధ్యత కాంట్రాక్టర్‌కు అప్పగించేశారు. దీంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రి: మండలంలోని యర్రగుంటపల్లి గ్రామ శివారులో శింగనమల మండలం, ఉల్లికల్లుకు చెందిన నాగార్జున (27) విషపు గుళికలు మింగి సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. నాగరాజు భార్య జ్యోతితో కుటుంబ సమస్యల కారణంగా తరచూ ఘర్షణలు జరుగుతుండేవి. సోమవారం ఉదయం జ్యోతి వాస్మాల్ సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. భార్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో భర్త నాగరాజు అనంతపురం వెళ్లలేదు. తాడిపత్రి మండలంలోని యర్రగుంటపల్లి వద్దకు వచ్చి, వెంట తెచ్చుకున్న విషపు గుళికలను మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్లిన కొందరు వ్యక్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

నేడు హనుమాన్ చాలీసా పారాయణం

అనంతపురం కల్చరల్: శ్రావణ మంగళవారాన్ని పురస్కరించుకొని ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు స్థానిక కోర్టు రోడ్డులోని వరదాంజనేయ స్వామి ఆలయంలో సామూహిక హనుమాన్ చాలీసా పఠనం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కర్నూలుకు చెందిన గోదా విష్ణు సహస్రనామ మండలి సహకారంతో 108 సార్లు హనుమాన్ చాలీసా పఠనం ఉంటుందన్నారు.

సెంట్రల్ పార్క్ స్థలం సర్వే ప్రారంభం

అనంతపురం క్రైం: వేణుగోపాల్ నగర్‌లో ఉన్న సెంట్రల్ పార్క్ స్థలం సర్వే కొనసాగింది. సెంట్రల్ పార్క్ స్థలం అన్యాక్రాంతమైందని కార్పొరేటర్ బండి నాగమణి, తదితరులు గత కౌన్సిల్‌లో బైఠాయించి, నిరసన తెలియజేశారు. రూ.కోట్లు విలువ చేసే సెంట్రల్ పార్క్ స్థలాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. సోమవారం ఏసీపీ బాలాజీ, టీపీఓ శిరీష, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాంజలి, సర్వేయర్ ప్రభాకర్, సచివాలయ సిబ్బంది సెంట్రల్ పార్క్‌లో ఓపెన్ స్థలాలను రోవర్ సహాయంతో సర్వే ప్రారంభించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలందాలి



గుల్జార్ పేటలో పేరుకుపోయిన డ్రైనేజీలను, రోడ్డు పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య

అనంతపురం క్రైం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలని, ఆ దిశగా స్థానిక సమస్యలను తెలుసుకోవాలని సచివాలయ సిబ్బందిని మేయర్ వసీం ఆదేశించారు. సోమవారం నగరంలోని 20వ డివిజన్‌లో సిటిజెన్ అవుట్ రీచ్ కార్యక్రమంలో మేయర్ పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై స్థానికులతో మేయర్ మాట్లాడారు. నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, నాయకులు చిన్ని, ఖాజా, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన..

నగరంలోని 18వ డివిజన్ పరిధిలోని గుల్జార్‌పేటలో సాధారణ నిధులు రూ.32.50 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను మేయర్ వసీం పరిశీలించారు. పనుల పురోగతిపై ప్రత్యేక దృష్టిసారించినట్లు మేయర్ పేర్కొన్నారు. పనులు జరిగే సమయంలో ఇంజినీర్లు అందుబాటులో ఉండాలన్నారు. డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు ముంతాజ్‌బేగం, సైపుల్లా బేగ్, కమల్‌భూషణ్, డీఈ చంద్రశేఖర్, నాయకులు రత్నమయ్య, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

మరువ వంక బ్రిడ్జి పనులు ప్రారంభం

నగరంలోని 13వ డివిజన్ పరిధిలోని రూ.60 లక్షలతో ఆర్డీటీ చేపట్టిన మరువ వంక బ్రిడ్జి పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, ఆర్డీటీ కన్‌స్ట్రక్షన్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి బ్రిడ్జి పనులకు భూమిపూజ చేశారు. బ్రిడ్జి శిథిలావస్థకు చేరిన విషయాన్ని స్థానికులు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి విన్నవించగా, ఆయన సమస్యను ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీసీ నాయకుడు బండి శ్రీకాంత్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

'స్పందన'కు ఆరు ఫిర్యాదులు..

నగర పాలక సంస్థలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి ఆరు ఫిర్యాదులు వచ్చాయి. ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కార్మిక సంఘం నాయకులు మేయర్‌ను కోరారు. స్పందనలో ఇంజినీరింగ్, 2, టౌన్ ప్లానింగ్ 1, పబ్లిక్ హెల్త్, రెవెన్యూ, సచివాలయానికి ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సావిత్రి, ఈఈ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన చంద్రశేఖర్



ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కార్పొరేటర్ సాకే చంద్రశేఖర్

అనంతపురం క్రైం: ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్‌రావును 33వ డివిజన్ కార్పొరేటర్ సాకే చంద్రశేఖర్ విజయవాడలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు ఆయన పుష్పగుచ్ఛం అందించారు. సంక్షేమ పథకాలతో పాటు ఎస్టీల సమస్యలను కార్పొరేటర్ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్పొరేటర్ వెంట వైఎస్సార్ సీపీ నాయకులు సాకే రామకృష్ణ, నాగరాజు నాయక్, సాకే శ్రీనివాసులు, కుంభా ఉదయ్‌కుమార్, కిరణ్, శేషు, రాము, శివ, అనిల్, ఆర్య, అక్బర్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఈఓ అక్కిరెడ్డి, కమిటీ చైర్మన్ దుబ్బ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ బెంగళూరు శంకరకంటి ఆస్పత్రి వారు నిర్వహించనున్న కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఐదుగురి నామినేషన్ల పరిశీలన

అనంతపురం క్రైం: స్టాండింగ్ కమిటీలకు దాఖలు చేసిన ఐదుగురి నామినేషన్లను పరిశీలించినట్లు నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు కంసల లీలావతి (22వ డివిజన్), గురుశేఖర్‌బాబు (50వ డివిజన్), తరిమెల అబూసలేహా (14వ డివిజన్), యం .రాజేశ్వరి (46), సంపంగి రామాంజనేయులు (24వ డివిజన్) నామినేషన్ దాఖలు చేసిన విషయం విదితమే.

సర్వజనాస్పత్రికి డిజిటల్ రేడియోగ్రఫీ పరికరం

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రికి రూ.12 లక్షలు విలువ చేసే డిజిటల్ రేడియోగ్రఫీ పరికరం మంజూరైంది. సోమవారం డిజిటల్ రేడియో గ్రఫీ పరికరం పనితీరుపై ట్రయల్‌రన్ చేశారు. ప్రస్తుతం రోజూ 250 నుంచి 300 వరకు రేడియాలజీ టెక్నీషియన్లు ఎక్స్‌రేలు తీస్తున్నారు. మంగళవారం నుంచి డిజిటల్ రేడియా గ్రఫీ అందుబాటులోకి రానుంది. తద్వారా రోగులకు సకాలంలో ఎక్స్‌రే నివేదికలు అందనున్నాయి.

కరువు మండలాలుగా ప్రకటించాలి

రాప్తాడురూరల్: జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం అనంతపురం రూరల్ తహసీల్దార్ శ్రీధరమూర్తిని కలిసి వినతిపత్రం అందించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సి.మల్లికార్జున మాట్లాడుతూ సకాలంలో వర్షాలు రాక వేరుశనగ పత్తి, ఆముదం, జొన్న, సద్ద తదితర పంటలు ఎండిపోయాయన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం అందించాలన్నారు. సీపీఐ రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ, మండల కార్యదర్శి రమేష్, మండల సహాయ కార్యదర్శి నరేష్, ధనుంజయ, గోవింద నాయక్, వెంకట రాముడు తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు: అనంతను కరువు జిల్లాగా ప్రకటించాలని సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి నాగరాజు కోరారు. సోమవారం సీపీఐ నాయకులు తహసీల్దార్ లక్ష్మీ నరసింహకు వినతి పత్రం ఇచ్చారు.

సెప్టెంబర్ 4న బహిరంగ సభ

రాప్తాడు: సెప్టెంబర్ 4న అనంతపురంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి నాగరాజు అన్నారు. సోమవారం స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సహకరించండి

అనంతపురం కల్చరల్: జీర్ణోద్ధరణ దశలో ఉన్న ఆలయాల అభివృద్ధికి టీటీడీ ద్వారా సహకారం అందించేందుకు కృషి చేయాలని ఇటీవల ఎంపికైన బోర్డు సభ్యుడు అశ్వర్థనాయక్‌ను సాయిట్రస్టు ప్రతినిధులు కోరారు. సోమవారం స్థానిక ఆర్కే నగర్‌లో అశ్వర్థనాయక్‌ను వారు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు విజయ్ కుమార్, చంద్రశేఖర్, రాఘవేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.